సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం। 8। ఆగస్టు। 2023



సమీకృత మార్కెట్..

మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ నిర్మాణం నత్తనడకన సాగుతుంది.

వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన వరద

ప్రియదర్శిని జూరాలకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో 74 వేలకు పెరిగింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /24.1

వాతావరణం

ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మల్దకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అధ్యాపకులు మెరుగైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి హృదయరాజు సూచించారు. సోమవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అధ్యాపకులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు, కళాశాలకు మంచిపేరు ప్రతిష్ట తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌లింగం, అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, గోవర్ధన్, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాజోళి చేనేత కార్మికుడికి బాపూజీ పురస్కారం



రాజోళి: మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు దర్జి వీరేష్‌కు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గుర్తింపు లభించింది. ఎంతో నైపుణ్యం కలిగిన చీరను తయారు చేసిన ఆయనకు సోమవారం జాతీయదినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాన్ని అందించారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆయనకు ఈ పురస్కారాన్ని అందచేశారు. గద్వాల జిల్లాలోని రాజోళి మండలంలో గత ఎన్నో ఏళ్లుగా వీరేష్ చేనేత కార్మికుడిగా అందించిన సేవలు, చీరల తయారీలో కలిగిన నైపుణ్యాన్ని గుర్తించి ఈ పురస్కారాన్ని అందచేసినట్లు చేనేత శ్రామిక సేవా సమితి సభ్యులు తెలిపారు.

మద్యం దుకాణాలకు 5 టెండర్లు

గద్వాల క్రైం: నూతన మద్యం పాలసీ ప్రక్రియలో భాగంగా సోమవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఐదు టెండర్లు దాఖలయ్యాయని సీఐ గోపాల్ తెలిపారు. జిల్లాలో అన్ని ఎస్సీ, గౌడ రిజర్వుడు, ఓపెన్ కేటగిరిలోని మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు 18తేదీ చివరి రోజు అని తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల అర్బన్: అఖిల బారత విద్యార్థి (ఏఐఎస్ఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రాజవర్ధన్, అధ్యక్షుడు శివకృష్ణ, ఉపాధ్యక్షుడు వీరేశేఖర్, నరేష్, నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రవీణ్, సహాయ కార్యదర్శులు యశ్వంత్, నవీన్, మల్లేష్, కోశాధికారి హనుమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నిరుపేద కుటుంబంలో పుట్టి.. ఎస్ఐకి ఎంపిక

మల్దకల్: నిరుపేద కటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్న ఓ విద్యార్థి ఎస్ఐకి ఎంపికయ్యారు. ఆదివారం వెలవడిన ఎస్ఐ ఫలితాల్లో మల్దకల్ మండలం బిజ్వారంకి చెందిన బతుకన్న, రూతమ్మ దంపతుల కుమారుడు సునీల్ ఎస్ఐకి ఎంపికయ్యారు. బతుకన్న, రూతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారిలో రెండవ వాడైన సునీల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య బిజ్వార్వరంలో కొనసాగగా.. ఇంటర్, డిగ్రీ విద్యను గద్వాల పట్టణంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్నారు. పట్టుదలగా చదివి ఎస్ఐకి ఎంపికయ్యాడు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సునీల్‌ను సన్మానించారు.

26 మంది సివిల్ ఎస్ఐల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం విడుదలైన ఎస్ఐ ఫలితాల్లో జోగుళాంబ గద్వాల జోన్–7 పరిధికి సంబంధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 26 మంది సివిల్ ఎస్ఐలు, ఐదుగురు ఏఆర్ ఎస్ఐలు ఎంపికయ్యారు. ఎంపికై న 26 మంది సివిల్ ఎస్ఐలలో 8మంది అమ్మాయిలు కాగా.. 18 మంది అబ్బాయిలు ఉన్నారు. అలాగే ఏఆర్ ఎస్ఐలలో నలుగురు అబ్బాయిలు.. ఒక అమ్మాయి ఉంది. ఎంపికై న ఎస్ఐలకు త్వరలోనే విధులు కేటాయించనున్నారు.

పంట.. పండింది

- ధరూరులో మొదటి దశ కోతకు..
- మరింత మంది మొగ్గుచూపుతున్న వైనం
- మూడేళ్లలో పంట కాపు ప్రారంభం
- 30 ఏళ్ల వరకు దిగుబడి
- జిల్లాలో 5,500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటల సాగు

కొత్త పంట కావడంతో ఈ నేలలు అనుకూలిస్తాయో లేదో.. రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టాలంటూ.. దిగుబడి వచ్చినా గిట్టుబాటు అవుతుందో కాదో.. ఇలా ఆయిల్‌పాం సాగుపై మొదట్లో రైతుల్లో ఎన్నో సందేహాలు తలెత్తాయి. రెండు మూడేళ్లుగా టీఎస్ ఆయిల్‌ఫెడ్ అధికారులు ఈ పంట సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో కొంతవరకు రైతులు మొగ్గుచూపారు. ఇటీవల ధరూరులో రైతు ఆయిల్ పామ్ మొదటి దశ పంట కోత కోయడం.. టీఎస్ ఆయిల్ ఫెడ్ అధికారులు నేరుగా వచ్చి కొనుగోలు చేయడంతో రైతుల సందేహాలు నివృత్తి కావడంతోపాటు.. మరింత మంది ఈ పంట సాగుకు ముందుకొస్తున్నారు.

జిల్లాలో పెరిగిన ఆయిల్‌పాం సాగు



ఆయిల్‌పాం తోటలో కోతను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

ధరూరు: జిల్లాలో ఆయిల్‌పాం తోటల సాగు రోజు రోజుకు పెరుగుతోంది. నెల రోజుల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 4,700 ఎకరాల్లో పంట సాగు చేయగా.. ఒక్క నెల రోజుల వ్యవధిలోనే 800 ఎకరాల్లో పంట సాగు అయ్యింది. అంటే జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,500 ఎకరాల్లో పట సాగు చేసుకున్నారు. ఇటీవల పంట చేతికి వస్తుండడంతో కోత కోస్తున్న పంట పొలాలను ఆయా ప్రాంతాల రైతులు వచ్చి చూసి.. అక్కడే ఉన్న తెలంగాణ ఆయిల్ ఫెడ్ అధికారులతో తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. పంట సాగు కోసం రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నారు.

80 నుంచి వంద శాతం సబ్సిడీ..

సన్న, చిన్న, పెద్దకారు రైతులు పంట సాగు చేసుకునేందుకు అర్హులు. ఇందుకు ప్రథమంగా 5 ఎకరాల కంటే తక్కువ ఉన్న రైతులకు ఓసీలకు 90శాతం, బీసీలకు 80 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఉంటుంది. అయితే జీఎస్టీ మాత్రం రైతులే చెల్లించాల్సి ఉంటుంది. పంట సాగు కోసం చెట్లకు సంబంధించిన అనుమతులు వచ్చినా.. సాగు చేసే పంట పొలంలో డ్రిప్ ఉంటేనే మొక్కలు ఇస్తారు. గుంతలు తీసేది మొదలు.. మొక్కలు నాటేంత వరకు ఈజీఎస్, హార్టికల్చర్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతూ ఉంటుంది. పంట నాటిన తర్వాత ఆయిల్‌ఫెడ్ అధికారులు తమ ఫీల్డ్ అసిస్టెంట్లను పొలాల వద్దకు పంపించి రైతులకు సలహాలు సూచనలు ఇస్తారు.



కుప్పగా పోసిన ఆయిల్‌పాం గెల

పంట మార్పిడికి మంచి అవకాశం...

ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పంట మార్పిడి పద్ధతికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. ఏళ్లుగా ఒకే రకమైన పంట సాగు కారణంగా పొలాలు సైతం ఆశించిన దిగుబడులను ఇవ్వడం లేదు. దీని, ఇతర పంట్ల తోటల రైతులు ఈ పంట సాగు చేసుకుంటే మంచి దిగుబడులు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

మూడేళ్లలో చేతికి..

ఆయిల్‌పాం తోటలో మొక్కలు నాటిన నాటి నుంచి 3 ఏళ్ల వరకు పెంచాల్సి ఉంటుంది. అప్పటి వరకు ఈజీఎస్ ద్వారా ఎకరాకు రూ.4,100 చొప్పున మెయింటెనెన్స్ కింద చెల్లిస్తూ ఉంటారు. ఆయిల్ ఫెడ్ కంపెనీ వారు పండిన పంటకు టన్నుకు రూ.12,200 చెల్లిస్తారు. గద్వాల మండలం కొత్తపల్లిలో రైతు పాల్ సుధాకర్, ఇటిక్యాల, మానవపాడు మండలాల్లోని వావిలాల గోవర్ధన్‌రెడ్డి వంటి రైతుల పొలాల్లో ఆయిల్ పంట చేతికొచ్చే దశలో ఉంది. అచ్చం టెంకాయ చెట్టును పోలి ఉంటున్న ఈ తోట ముప్పై ఏళ్ల వరకు దిగుబడినిస్తుంది.

టన్ను వరకు దిగుబడి



నేను నాలుగున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం పంట సాగు చేశాను. ఇటీవల పంట చేతికొచ్చింది. ఒక చెట్టుకు 24 మట్టలు ఉన్నాయి. అంటే మట్టకు ఒకటి చొప్పున గెల వస్తుంది. ఇటీవల పంట కోశాను. ఒక టన్ను వరకు పంట దిగుబడి వచ్చింది. దీంతో పాటు అంతర పంటలను సాగు చేసుకుంటున్నా.

– మద్దిలేటి, రైతు, ధరూరు

అవగాహన అవసరం..



నేను మొదట ఆయిల్‌పాం సాగు విషయంలో భయపడ్డాను. ఎక్కడ మార్కెటింగ్ చేసుకోవాలో తెలియదు. ధైర్యం చేసి 9 ఎకరాల్లో పంట సాగు చేశాను. ప్రస్తుతం మదిలేటి అన్న పంట వద్ద అధికారులు వచ్చి పంటను సేకరించడం చూస్తుంటే నాలో ఉన్న కొద్దిపాటి భయం పోయింది. మరో ఏడాదిలో నా పంట కూడా చేతికి వస్తుంది. హార్టీకల్చర్ అధికారులు సైతం గ్రామాల్లో రైతులకు మరింత అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– దశరథం, రైతు, ధరూరు

అధిక లాభాలు



జిల్లాలోని నేలలు ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా ఉన్నాయి. మూస పద్ధతిలో కాకుండా రైతులు ఈ పంట సాగు చేపట్టాలి. ఒక్క మొక్క ధర రూ.193 కాగా.. రైతులకు సబ్సిడీ పోను కేవలం రూ.20కే అందిస్తున్నాం. నాలుగేళ్ల వరకు పంట మెయింటెనెన్స్ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. బీచుపల్లిలోనే మార్కెట్ సౌకర్యం ఉంది. పంట విక్రయించిన వారం రోజుల్లో రైతుల బ్యాంకు అకౌంట్లలో మొత్తం నగదు జమ అవుతుంది.

– అక్బర్ అలీ, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్

వ్యవసాయ కమతాల గణన పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న గణాంక శాఖ సహాయ సంచాలకులు మల్లీశ్వరి

- పంటకోతల సమాచారం సమగ్రంగా తీసుకోవాలి
- రాష్ట్ర గణాంక శాఖ సహాయ సంచాలకులు మల్లీశ్వరి

గద్వాల వ్యవసాయం: వ్యవసాయ కమతాల గణనను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర గణాంక శాఖ సహాయ సంచాలకులు మల్లీశ్వరీ సూచించారు. రైతుల జీవన స్థితిగతులు, పంటకోత ప్రయోగాలు, సాగు కమతాల సర్వాప స్వభావ గణనను వ్యవసాయ, గణాంక శాఖలు సంయుక్తంగా చేపడుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని అనంతాపురం రైతువేదికలో ఏఈఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫేస్–1లో భాగంగా ఆయా గ్రామాల్లో ఏ రైతుకు ఎంత కమతం ఉంది, కమ్యూనిటీ, లింగం ఏమిటి తదితర వివరాలను సమగ్రంగా సేకరించి యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఇది వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఫేస్–2లో ఏఏ కమతాల్లో ఏ రకమైన నీటి వనరులతో వ్యవసాయం చేస్తున్నారు వివరాలు తీసుకోవాలన్నారు. ఫేస్–3 పంటకోత ప్రయోగాల్లో భాగంగా రైతులు తమ కమతాల్లో వేసిన పంటల వివరాలు, దిగుబడుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. కమతాల గణన, పంటకోత ప్రయోగాల వివరాల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ పరంగా ఎలాంటి మౌళిక సదుపాయలు ఉన్నాయి తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడతుందున్నారు. దీంతో పాటు ఎక్కడెక్కడ ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చు, ఆయా పరిశ్రమలకు కావాల్సిన రా మెటీరియల్ లభ్యం కావడానికి కలిగిన సాధ్యా సాధ్యాలపై అవగాహన వస్తుందన్నారు. రైతుల నుంచి సమగ్రంగా సమాచారం సేకరించి యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మణ్, డీపీఓ గోవిందునాయక్, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, ఏడీఏలు సంగీతలక్ష్మీ, సక్రియానాయక్, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

అపెక్స్ ఆధ్వర్యంలో డయాలసిస్ సేవలు

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సోమవారం అపెక్స్ కంపెనీ ఆధ్వర్యంలో డయాలిసిస్ సెంటర్‌ను ఆసుపత్రి సూపరిండెంట్ కిషోర్‌కుమార్ ప్రారంభించారు. అయితే గతంలో డీమెడ్ కంపెనీ నిర్వాహకులు డయాలిసిస్ రోగులకు సేవలు అందించే వారని డయాలిసిస్ విభాగ సిబ్బంది నర్సింహ తెలిపారు. వారి కాలపరిమితి పూర్తి కావడంతో ఈ నెల 29వ తేదీ నుంచి అపెక్స్ కంపెనీ వారు సేవలు అందిస్తున్నారు. అయితే మొదటి అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు డయాలిసిస్ విభాగాన్ని మార్పు చేయడంతో రోగులకు కొంత ఇబ్బందులు తప్పాయి.

వేరుశనగ క్వింటా రూ.7,611

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు సోమవారం 714 క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్టం రూ.7611, కనిష్టం రూ. 4669, సరాసరి రూ. 5969 ధరలు లభించాయి. అలాగే, 6 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి ధర రూ.5909 ధర వచ్చింది.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పూర్తి భరోసా కల్పిస్తోందని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు, సీఎం సహాయ నిధి ద్వార ఆర్థిక చేయుతను అందజేస్తోందని ఎమ్మెల్యే వీఎం.అబ్రహం అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదల ప్రాణాలను సీఎం సహాయ నిధి కాపడుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది పేదల ప్రాణాలు నిలబడ్డాయన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందిన వారికి తోడ్పాటును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటిక్యాల మండలంలో 10 మంది లబ్ధిదారులకు రూ. 2.23 లక్షలు, అయిజలో ఆరుగురికి రూ.2.94లక్షలు, మానవపాడు ఐదుగురికి రూ.1.05లక్షలు, వడ్డేపల్లిలో నలుగురికి రూ.78వేలు, ఉండవల్లో ముగ్గురికి రూ.60వేలు, అలంపూర్‌లో ఇద్దరికి రూ.52 వేలు, రాజోలిలో ఇద్దరికి రూ.32వేలు అందజేశారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం

ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తిచేస్తాం

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన సంక్షేమభివృద్ధి పథకాల లక్ష్యాలను వందశాతం పూర్తి చేస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమాభివృద్ధి పథకాలను వంద శాతం పూర్తి చేస్తామని, హరితహారం, గొర్రెల పథకం, దళితబంధు, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం, జీవో 59అమలు, నోటరి భూముల క్రమబద్ధీకరణ, ఇంటిస్థలాల పంపిణీ, గృహలక్ష్మీ వంటి పథకాలు అన్ని పురోగతిలో ఉన్నాయన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చీర్ల శ్రీనివాస్, డీఆర్‌డీఏ ఉమాదేవి, డీఏవో గోవింద్ నాయక్, హార్టికల్చర్ అధికారి అక్బర్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి...

గద్వాల రూరల్: ప్రజల నుంచి వచ్చిన ప్రతిఫిర్యాదు సత్వరం పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) చీర్ల శ్రీనివాస్ అన్నారు. ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 102 ఫిర్యాదులు వచ్చినట్లు ఇందులో 89భూసమస్యలు కాగా, మిగిలినవి పింఛన్లు ఇతర సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 19 ఫిర్యాదులు...

గద్వాల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 19 ఫిర్యాదులు అందాయి. భూ వివాద, కుటుంబ, ఆస్తి తగాదాలపై ఏఎస్పీ రవి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన వారితో మాట్లాడుతూ.. విడతల వారీగా సమస్యలు పరిష్కారం చేస్తామని, సివిల్ కేసులను కోర్టులో పరిష్కారం చేసుకోవాలని సూచించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ చీర్ల శ్రీనివాస్

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

గద్వాల అర్బన్: ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి వేయాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ శశికళ, డిప్యూటీ డీఎంహెచ్ఓ సిద్ధప్ప అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ సెంటర్‌ను వారు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన రికార్డులు, డ్యూలిస్టు, సర్వే ఫారమ్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 7నుంచి వచ్చే అక్టోబర్ 14వ తేదీ వరకు విడతల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటితో పాటు హైరిస్క్ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణాల జరిగే ప్రాంతాలు, సంచర జాతులు ఉండే ప్రాంతాల్లో సందర్శించి వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని 0–5ఏళ్ల పిల్లలను గుర్తించి డ్యూ లిస్టు తయారు చేస్తారన్నారు. దీని ప్రకారం పిల్లలకు టీకాలు వేస్తారని తెలిపారు. మధుసూదన్ రెడ్డి, నరేంద్రబాబు, పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్త సువర్ణ లత పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ శశికళ

ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం తెచ్చిన గద్దర్



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: తన ఆట పాటలతో ప్రజల్లో గద్దర్ చైతన్యం తెచ్చారని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గద్దర్ మృతి తీరని లోటు అని, తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచు పూడురు ఈశ్వర్, తాన్యనాయక్, మద్దిలేటి, ఇమ్మానియేల్, ధరూర్ రవి, శేఖర్, శ్రీనివాస్ నాయుడు, గణేష్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు


ప్రజా గాయకుడు గద్దర్ మృతి తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటు అని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇంచార్జ్ అతిఖుర్ రహ్మాన్ అన్నారు. గద్దర్ మృతిపై ఆయన సంతాపం తెలియజేశారు.

వైద్యరంగంలో ఏఎన్ఎంల సేవలు వెలకట్టలేనివి

గద్వాల అర్బన్: రాష్ట్రంలో వైద్య రంగం అగ్రగామిగా నిలవడంలో ఏఎన్ఎంల సేవలు కీలకమని, కరోనా సమయంలో ఏఎన్ఎంలు అందించిన సేవలు వెలకట్టలేనివని జెడ్పీచైర్‌పర్సన్ సరిత కొనియాడారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆల్ కాంట్రాక్టు ఏఎన్ఎంలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టగా..ఈ ధర్నాకు జెడ్పీచైర్‌పర్సన్ మద్దతు తెలిపి మాట్లాడారు. 20 ఏళ్లుగా ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు ఎన్నో సంవత్సరాలుగా తమను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి, మంత్రులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఎలాంటి రాత పరీక్ష లేకుండా ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఆరోగ్యశాఖ అధికారికి ఆమె ఫోన్ చేసి ఏఎన్ఎంలకు న్యాయం జరిగే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మ, నవీన, సువర్ణ, పార్వతి, భారతి, జ్యోతి, విద్యావతి, లక్ష్మీ, నర్మదా పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లలో జాతీయ పతకాలు

వనపర్తిటౌన్: అజాదీకా అమృత మహోత్సవాల్లో భాగంగా గతేడాది తరహాలోనే ఈ ఏడాది ఇంటింటా, ప్రతి కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేయాలని వనపర్తి ప్రధాన పోస్టల్ సూపరింటెండెంట్ పెద్ద వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు 75 ఏళ్ల స్వాతంత్ర్య వైభవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. సోమవారం పోస్టల్ కార్యాలయంలో నాణ్యవంతంగా అందుబాటులో ఉండే జాతీయ పతకాలను విడుదల చేశారు. తిరంగా జెండాలను ప్రతి పోస్టల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, ప్రతి జెండా రూ.25 లకే అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల నుంచి మొదలుకొని ఉన్న ప్రతి పోస్టల్ కార్యాలయంలో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.



క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

ఊర్కొండ: ద్విచక్రవాహనం గేదెను ఢీకొట్టడంతో ఏడాది చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా తల్లిదండ్రులకు గాయాలైన ఘటన సోమవారం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ కథనం ప్రకారం.. మిడ్జిల్ మండలంలోని వేములకు చెందిన కావలి రాఘవేందర్, రాధిక భార్యాభర్తలు. వారికి ఏడాది కూతురు ప్రిన్సి ఉంది. భార్య కడుపుతో ఉండడంతో ఆమెను, పాపను తీసుకొని ద్విచక్ర వాహనంపై కల్వకుర్తి ఆస్పత్రికి బయలుదేరాడు. ఊర్కొండ మండల పరిధిలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం గేదెను ఢీకొట్టింది. దీంతో పాప అక్కడికక్కడే మృతి చెందగా, భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గేదె కూడా మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూర్ఛతో వ్యక్తి..

నవాబుపేట: మూర్ఛ వ్యాధితో కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని హన్మాసానిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శేఖర్(30) రెండు నెలల కిందట మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన శేఖర్ సంత నుంచి తిరిగి వెళ్తూ మద్యం తాగాడు. ఆయనకు గతంలో తరచుగా వచ్చే ఫిట్స్(మూర్ఛ) రావటంతో కిందపడిపోయాడు. ఆలస్యంగా.. చూసిన గ్రామస్తులు భార్య వరలక్ష్మికి సమాచారం ఇచ్చారు. ఆమె బంధువుల సాయంతో భర్తని జిల్లా ఆస్పత్రికి తరలించింది. అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


సంపత్ కుమార్ రెడ్డి (ఫైల్)

దేవరకద్ర రూరల్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం డోకూర్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. డోకూర్‌కు చెందిన సంపత్‌కుమార్ రెడ్డి(30) గ్రామ సమీపంలోని రైల్వే పట్టాల పై గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెంచు మహిళ హత్య

కొల్లాపూర్/కొల్లాపూర్ రూరల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనుల వద్ద చెంచు మహిళ దారుణహత్యకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలవెంకటరమణ కథనం ప్రకారం.. కొల్లాపూర్ మండలం ఎల్లూరు చెంచు గూడేనికి చెందిన చెన్నమ్మ(40), భర్త బల్మూరు కురుమయ్య ఇద్దరు కలిసి కోతిగుండు సమీపంలో పోడుభూమి సాగుచేస్తూ, కృష్ణానదిలో చేపల వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఆమె కొల్లాపూర్‌లో సంత చేసుకొని సాయంకాలం 4గంటలకు పాలమూరు ప్రాజెక్టు పనులు చేపట్టిన ప్రాంతం గుండా పొలం వద్దకు వెళ్లింది. సోమవారం ఉదయం వరకు ఆమె కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు ప్రాజెక్టు పరిసరా ప్రాంతాల్లో వెతికారు. పాలమూరు ప్రాజెక్టు అప్రోచ్ చానల్ రెగ్యులేటరి కింది బాగంలో చెన్నమ్మ మృతదేహం లభించింది. ఆమె శరీరంపై గోర్లతో రక్కిన గాయాలున్నాయి. ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులే ఆమెపై అత్యాచారం చేసి హత్య చేశారని కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో చోరీ కేసులో వ్యక్తికి రిమాండ్

కందనూలు : జిల్లా కేంద్రంలో ఆటో చోరీ చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లికి చెందిన చంద్రకంటి శేఖర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 6న ఆటోను, గతంలో వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలంలో మరో ఆటోను చోరీ చేశాడు. పోలీసులు కేసు న మోదు చేసి సీసీ పుటేజీ ద్వారా దర్యాప్తు చే యగా శేఖర్ ఆటోలు చోరీ చేసినట్లు గుర్తించా రు. చోరీ చేసిన రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీయత్నం కేసులో..

గద్వాల క్రైం: చోరీ యత్నం కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల పట్టణం నల్లకుంట కాలనీలో సుజాతమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. పట్టణానికి చెందిన విజయ్ రెండు రోజుల క్రితం ఇంట్లోకెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసు అపహరించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆమె పెంపుడు కుక్క నిందితుడిపై దాడి చేయడంతో తప్పించుకుపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం పట్టణ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితున్ని అదుపులోకి తీసుకోని విచారించారు. నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమీకృత మార్కెట్ ఇంకెన్నాళ్లకు..?

- పునాదులతో దర్శనం.. నిర్మాణంలో ఆలస్యం
- కూరగాయల విక్రయాలకు ఇబ్బందులు
- పనుల్లో జాప్యం.. పట్టించుకోని అధికారులు

జడ్చర్ల: పట్టణంలో కూరగాయల కొనుగోలు చేయాలంటే ఒక చోటుకు, మటన్, చికెన్ కొనాలంటే మరోచోటుకు, చేపలు, పండ్లు, పూలు, పాలు తదితర నిత్యవసర వస్తువులు కొనాలంటే వేర్వేరు చోట్లకు వెళ్లాలి. ఈ పరిస్థితిని అధిగమించి అన్నీ ఒకే చోట లభించేలా తెలంగాణ ప్రభుత్వం రెండేళ్ల క్రితం సమీకృత(ఇంటిగ్రేటెడ్) మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మార్కెట్ ఏర్పాటుతో ప్రజలకు కావల్సిన అన్ని వస్తువులు ఒకే చోట దొరకడం వల్ల కాలయాపన తప్పుతుంది. ఆయా వస్తువుల కోసం హైరీబరీగా తిరగాల్సిన పరిస్థితి ఉండదు. దీంతో పట్టణ ప్రజలకు ఉపశమనం కలుగుతుంది.

రూ.4.50 కోట్లతో పనులు..

జడ్చర్ల పురపాలికలో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. అధికారులు, పాలకులు సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు కావల్సిన స్థలం ఎంపికపై కసరత్తు చేసి చివరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న స్థలాన్ని ఖరారు చేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి దాదాపు ఏడాది పూర్తి అయినా మార్కెట్ నిర్మాణ పనుల్లో పురోగతి లేదు.

పునాదులకే పరిమితం..

సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. ఫుటింగ్ పనులు పూర్తి చేసి మిగతా పనులు వదిలేశారు. చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత కొరవడిందన్న ఆరోపణలున్నాయి. సమీకృత మార్కెట్ నిర్మాణంపై సంబంధిత అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

సరిపడని స్థలం..

సమీకృత మార్కెట్ యార్డుకు కనీసంగా రెండెకరాల స్థలం ఉండాలి. కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు, పాలు వంటి వ్యాపార దుకాణాలకు వేర్వేరుగా షెడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. కొనుగోలుదారులకు వీలుగా వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాలి. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణానికి అంతస్థలం అందుబాటులో లేదు. పట్టణ ప్రజలకు సౌకర్యంగా మార్కెట్‌కు అనువైన స్థలం లేకపోవడంతో చివరకు మండల పరిషత్, మండల మహిళా సమాఖ్య, ఎంఆర్‌సీ, వ్యవసాయశాఖ కార్యాలయాలు కొనసాగుతున్న ప్రాంగణంలో సమీకృత మార్కెట్‌కు స్థలాన్ని ఎంపిక చేశారు. ఇదే స్థలంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల భవనాలు ఉండగా వాటిని కూల్చేసి సమీకృత మార్కెట్‌కు అనువుగా చదును చేశారు. అయినా మార్కెట్‌కు సరిపడేంత స్థలం లేదు.

కోర్టు స్థల సేకరణకు చర్యలు..

ఇదే ఆవరణలో ఓ పక్క కోర్టు ఉంది. కోర్టును అక్కడి నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారికి దగ్గర మండల పరిషత్ కార్యాలయం ముందు భాగంలో కోర్టు భవనాన్ని నిర్మించేందుకు వీలుగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకున్నారు. నూతన భవనం పూర్తయి కోర్టును అక్కడికి తరలిస్తే తప్పా సమీకృత మార్కెట్‌కు సరిపడ స్థలం ఏర్పడదు.

ప్రస్తుతం క్రయవిక్రయాలకు ఇబ్బందులు..

పట్టణంలో కూరగాయల క్రయవిక్రయాలకు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు అమ్మకం దారులు, ఇటు కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూరగాయలు తెచ్చే రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. నేతాజీ చౌరస్తాలో కూరగాయల విక్రయాలు అప్పుడప్పుడు నిర్వహిస్తారు. ఇక్కడ ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో మున్సిపల్ అధికారులు ఇక్కడ కూరగాయల విక్రయాలకు అనుమతించడం లేదు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు రహదారిని అనుసరించి క్రయవిక్రయాలు సాగుతున్నాయి. మార్కెట్‌కు పంటలు తెచ్చినప్పుడు, రైల్వే రేక్ పాయింట్ నుంచి ఫర్టిలైజర్ బస్తాల తరలింపు సమయాల్లో ఇక్కడ తీవ్ర రద్దీ ఏర్పడుతుంది. కూరగాయల క్రయవిక్రయాలకు అవరోధం కలుగుతుంది.

మూతబడిన రైతుబజార్..

రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతుబజార్ మూతపడింది. అటు ప్రజలకు, ఇటు కూరగాయల క్రయవిక్రయదారులకు అనుకూలంగా లేకపోవడంతో అటువైపు కన్నెతి చూసేవారే కరువయ్యారు. అధికారులు, పాలకులు స్పందించి సమీకృత మార్కెట్ నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పునాదుల వద్దే నిలిచిన సమీకృతమార్కెట్ యార్డు పనులు

కాంట్రాక్టర్‌తో మాట్లాడతాం..



సమీకృత మార్కెట్ యార్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటాం. పనుల్లో ఆలస్యం చోటు చేసుకున్నది. ఇందుకు గల కారణాలు తెలుసుకొని, త్వరగా పనులు పూర్తయ్యేలా కృషి చేస్తాం.
– లక్ష్మి, చైర్‌పర్సన్, మున్సిపాలిటీ, జడ్చర్ల

పూర్తి చేసేందుకు చర్యలు..



సమీకృత మార్కెట్ యార్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నిధుల విడుదల జాప్యం వల్ల పనులు నిలిచిపోయాయి. నాణ్యతగా సకాలంలో పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
– మహ్మద్ షేక్, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మాగనూర్: మండల కేంద్రంలోని కొత్తపల్లి చౌరస్తాలో సోమవారం ఉదయం రైతులు ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వర్కూర్ నుంచి ఇసుక రీచ్‌లకు వస్తున్న ఇసుక టిప్పర్ల వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నట్లు పేర్కొన్నారు. ఇసుక రీచ్ యాజమానులకు మైనింగ్ అధికారులు ఆంక్షలు విధించినా పాటించడం లేదన్నారు. టిప్పర్లు తిరిగే రోడ్లపై దుమ్ము దూళీ లేవకుండా నిత్యం ట్యాంకర్లతో నీళ్లు కొట్టించాలని, మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వకుండా, ట్రాక్టర్లకు సౌండ్ బాక్స్‌లు బిగించవద్దని సూచించినట్లు తెలిపారు. మైనింగ్ అధికారుల చెప్పిన నియమ నింబంధనల్లో ఏ ఒక్కటీ పాటించడం లేదని పేర్కొన్నారు.

మధ్యాహ్నం 12 గంటల సమయంలో మైనింగ్ ఆర్‌ఐ రమేష్ అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడినా, వారు వినకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయాడు. సాయంత్రం 4 గంటలకు ఇసుక రీచ్ వారు రైతు నరహరిపై మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రైతును అదుపులోకి తీసుకుని, టిప్పర్లను వదిలేశారు. తమ సమస్య తీర్చాలని అడిగితే తమపై కేసులు పెట్టడం ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

11మందికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన 11మందికి కోర్టులో న్యాయమూర్తి జరిమానా విధించారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన 11మంది పట్టుబడ్డారు. వారందరిని సోమవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి డీ నిర్మల వాహనదారులకు రూ.27వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి భేష్


తిర్మలాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

రాజాపూర్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు భేష్‌గా ఉన్నాయని కేంద్ర బృందం సభ్యులు కర్పూరపు అరుణసాయితేజ్, అంద్రాజు అంబికశ్రీలు తెలిపారు. మండలంలోని తిర్మలాపూర్, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం కేంద్రం బృందం సభ్యులు పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవడం, వాటిని వాడుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించినట్లు తిర్మలాపూర్ సర్పంచ్ మహేశ్వరి కేంద్ర బృందం సభ్యులకు వివరించారు. ఇంకుడు గుంతలు, అండర్ డ్రెయినేజీలు చేపట్టినట్లు తెలిపారు. సీసీరోడ్లు, రోడ్డు కిరువైపుల ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏపీఓ భారతి, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు


నల్లమల అటవీ ప్రాంతంలో వాచ్ టవర్ ప్రారంభంలో పాల్గొన్న అటవీ శాఖ ఉన్నతాధికారులు

లింగాల: నల్లమల అడవుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పీసీసీఎఫ్ డబ్ల్యూఎల్ లోకేష్ జయస్వాల్ అన్నారు. సోమవారం మండలంలోని నల్లమల ప్రాంతంలోని అప్పాయపల్లి పరిధిలోని గిరిజ గుండాల సమీపంలో కొత్తగా నిర్మించిన 'వాచ్ టవర్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాచ్ టవర్ వల్ల అటవీ ప్రాంతాన్ని రక్షించవచ్చన్నారు. అడవిలో అసాంఘిక కార్యక్రమాలు, అడవుల దహనం, వన్యప్రాణుల వేట తదితర వాటిని వాచ్‌టవర్ ద్వారా గుర్తించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఏటీఎల్ క్షితిజ, ఎఫ్‌డీఓ ఎఫ్‌సీ పార్టీ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ వీరేశం, శరత్ చంద్రారెడ్డి, ఖాదర్‌పాష, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడపై చిరుత దాడి

మరికల్: లేగదూడపై అర్ధరాత్రి చిరుత దాడి చేసి చంపిన ఘటన రాకొండ శివారులో చోటుచేసుకుంది. రాకొండ గుట్ట దగ్గర తన వ్యవసాయ పొలంలో ఆదివారం సాయంత్రం రైతు శివారెడ్డి పశువులను కట్టేసి ఇంటికొచ్చాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత లేగదూడపై దాడి చేసి చంపేసింది. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు చనిపోయిన లేగదూడను చూసి సర్పంచ్ రాజుకు చెప్పడంతో, సర్పంచ్ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఘటనా స్థలానికి అటవీశాఖ బీట్ ఆఫీసర్ మల్లేష్ చనిపోయిన లేగదూడను పరిశీలించి చిరుత దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించాడు.


లేగ దూడను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారి

రేషన్ బియ్యం పట్టివేత



వీపనగండ్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మండలంలోని గోవర్ధనగిరిలో పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల కథ నం ప్రకారం.. కర్నూల్ జిల్లా దేవరకొండ మండలం కేతేపల్లికి చెందిన ఎరుకలి దుబ్బన్న, మద్దిలేటిలు బొలేరో వాహనంలో 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో కొల్లాపూర్ నుంచి పెబ్బేరుకు తరలిస్తుండగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గోవర్ధనగిరి వద్ద పట్టుకోని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిప్రకాశ్ తెలిపారు. పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని వనపర్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిషోర్ పంచనామా నిర్వహించారు.

ప్రేమించి మోసం చేశాడని పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మాధవరావుపేటకి చెందిన కిరణ్ 10 సంవత్సరాల నుంచి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌కి చెందిన కవిత తనకు పుట్టిన బాబుతో కలిసి సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపింది. కిరణ్ తల్లిదండ్రులు కట్నం తెస్తేనే పెళ్లి చేసుకుంటామని వేధిస్తున్నారని చెప్పింది. నాకు రెండు సంవత్సరాల బాబు ఉన్నాడంది. కిరణ్ తలిదండ్రులు కులం పేరుతో ఇంట్లోకి రానివ్వడం లేదన్నారు. ఈ విషయమై సీఐ యాలాద్రిని వివరణ కోరగా.. కిరణ్‌పై కేసు చేసి నెలరోజుల కిందటే రిమాండ్‌కు తరలించామన్నారు. అత్తామామలు కులం పేరుతో వేధిస్తున్నారని బాధితురాలు కవిత ఫిర్యాదు చేసిందన్నారు. ఈ సంఘటపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

మహాయాగానికి చురుకుగా ఏర్పాట్లు

- ఈ నెల 14 నుంచి 27 వరకు నిర్వహణ
- జడ్చర్లలో 80వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం

జడ్చర్ల: ప్రకృతి సమతుల్యత, విశ్వశాంతి, సమస్త మానవాళి, జీవరాసుల మనుగడ, సమస్త కర్మలు, పాప దోశాల నివారణ కోసం జడ్చర్లలో ఈనెల 14వ తేదీ నుంచి ఆయిత చండీ అతిరుద్రం 80వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా తాలూకా క్లబ్ రోడ్డు సమీపంలోని విశాలమైన మైదానంలో మహోత్సవ యజ్ఞ యాగాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 14వ తేదీన గణపతి పూజతో మొదలై, ఈనెల 27వ తేదీ వరకు ప్రతి రోజూ వివిధ కార్యక్రమాలు, పూజలు, యాగాలు, యజ్ఞాలు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా శ్రీ కృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి మాట్లాడుతూ ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ ఆయిత చండీ అతిరుద్రం మహాయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యజ్ఞ హోమాలకు 50 లారీల రావి, మోదుగ సమిదలను వినియోగిస్తామన్నారు. 60వేల కిలోల ఆవు నెయ్యిని హోమాలలో వినియోగించనున్నట్లు తెలిపారు. లక్ష తమలపాకులతో అర్చన, 10 వేల పార్థీవ లింగాలకు 2వేల ఆవుల నుంచి తీసుకొచ్చిన పాలతో అభిషేకం చేస్తామన్నారు. భక్తులకు ఉదయం, సాయంత్రం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం అన్న ప్రసాదం అందజేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


జడ్చర్ల శివారులో యాగానికి సిద్ధమవుతున్న మండపం

సైకిల్‌పై 17 రాష్ట్రాలు చుట్టేశాడు..

దేవరకద్ర: దేశంలో శాంతి నెలకొల్పాలని, ఎలాంటి మత ఘర్షణలు లేకుండా చూడాలని ప్రార్థిస్తూ ఒక వ్యక్తి 17 రాష్ట్రాలు చుట్టేశాడు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూర్ పట్టణానికి చెందిన విజయ గోపాలకృష్ణ దేశ శాంతి కోసం 2022 మార్చి 11వ తేదీన సింధనూర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించాడు. నిర్విరామంగా యాత్ర కొనసాగిస్తూ 17 రాష్ట్రాలను చుట్టేసి చివరగా తన సొంత ఊరుకు బయలు దేరాడు. సోమవారం దేవరకద్ర పట్టణానికి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, యానం, తెలంగాణ మీదుగా తిరిగి కర్ణాటక వెళ్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 514 రోజులు సైకిల్ యాత్రను కొనసాగించినట్లు తెలిపారు. దేశంలో 12 పుణ్య నదులు ఉండగా, 11 పుణ్యనదుల్లో స్నానం చేసి ప్రముఖ దేవాలయాలను సందర్శించుకుని పూజలు చేశానన్నారు. త్వరలో తన సొంత పట్టణానికి చేరుకుంటున్నట్లు తెలిపారు.


దేవరకద్రకు చేరుకున్న కర్ణాటక వాసి విజయ గోపాలకృష్ణ

జూరాలకు పెరిగిన వరద

- 74 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 5 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు/ మదనాపురం/ దోమలపెంట/ దేవరకద్ర/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో సోమవారం పెరిగింది. ఆదివారం రాత్రి 8 గంటలకు 39 వేల క్యూసెక్కులు రాగా.. సోమవారం రాత్రి వరకు 74 వేలకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో 5 గేట్లు ఎత్తి 36,552 క్యూసెక్కులు వదిలారు. నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వకు 730 క్యూసెక్కులు వదలగా.. మరో 88 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.571 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 66,750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 70,731 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా.. 121.262 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 67,600 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 31.01 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


జూరాల క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయానికి జూరాల ఎడమ కాల్వ ద్వారా 730 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో సోమవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,020 అడుగులకు చేరింది. దీంతో వ్యవసాయ అవసరాల కోసం ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 900, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

కోయిల్‌సాగర్ 313 క్యూసెక్కులు

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రం వరకు 27.1 అడుగులకు చేరింది. జూరాల ప్రాజెక్టు ఉంద్యాల పంపుహౌజ్ నుంచి ఒక మోటారు రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటలకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా.. గేట్ల స్థాయి 32.6 అడుగులు ఉంది. మరో 5.5 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు నిండుతుంది.

శ్రీశైలం జలాశయంలో..

శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి జూరాల నుంచి 56,902 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తుంది. ఇదే సందర్భంలో ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 4,975 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,242 క్యూసెక్కుల నీటిని వదలగా.. 301 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 262.800 అడుగుల వద్ద 112.9696 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. సోమవారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు కలిపి 433 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 106.814 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు.